క్లుప్తంగా

హరీశ్‌రావు పరామర్శ



నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి నానమ్మ మల్లమ్మ ఇటీవల మృతి చెందగా మాజీ మంత్రి హరీశ్‌రావు కిష్టంపేటలో వారి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన వెంట స్వామి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగురవేద్దాం



సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్‌ఎస్ పార్టీ దూళ్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. దూళ్మిట్ట మండలంలోని బెక్కల్, తోర్నాల గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు వచ్చేలా అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. నాయకులు భిక్షపతిగౌడ్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం



సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్లలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు ఎమ్మెల్యే హరీశ్‌రావు అందజేసిన ఆర్థిక సాయాన్ని పలువురు నాయకులు ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన మల్లయ్య, నర్సవ్వ, మల్లయ్య కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు శ్రీనివాస్, చంద్రం, పరశురాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్నా..



మట్లాడుతున్న మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బరిలో తాను ఉంటున్నానని, 10న నామినేషన్ వేయనున్నట్లు బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేయాలని స్నేహితులు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు పోటీ చేయనున్నట్లు చెప్పారు. 30 యేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో, మంజీరా అక్షరప్రభ కార్యక్రమాల ద్వారా వయోజనులకు విద్య బోధించానని, ఉమ్మడి నాలుగు జిల్లాల ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యంగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, హరిప్రసాద్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర నేతకు సన్మానం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయిన జిల్లాకు చెందిన తిరుపతిరెడ్డిని సామాజిక ప్రజా సంఘాల నేతలు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో శ్రీహరి, పి.శంకర్, యాదగిరి, నరేందర్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం

సిద్దిపేటజోన్: టీచర్స్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులు మల్లారెడ్డి, రవీందర్ ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పలు వార్డుల్లో డిగ్రీ, జూనియర్ కళాశాల మైదానంలో ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యం కింద ఓటు వేయాలని అభ్యర్థించారు.

పాత డ్రైనేజీలతో పాట్లు

పట్టణ పరిధిలోని చాలా ప్రాంతాలలో డ్రైనేజీలన్నీ పదేళ్ల క్రితం నిర్మించినవే. ఇప్పుడు పెరిగిన ఇళ్లు, జనాభా సంఖ్యకు తగ్గట్లు అవి లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అభివృద్ధి చెందినా పారిశుద్ధ్య నిర్వహణలో వెనుకబడే ఉంది. గత పాలకవర్గం, మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు.

- పట్టణంలో చాలా వరకు పదేళ్ల క్రితం నిర్మించినవే..
- శిథిలావస్థకు చేరినవి కొన్ని, ధ్వంసమైనవి మరికొన్ని..
- రోడ్లు, వీధుల్లోకి చేరుతున్న మురుగు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



9వ వార్డు పరిధిలో ధ్వంసమైన డ్రైనేజీ





డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం

చేర్యాల(సిద్దిపేట): పంచాయతీగా ఉన్నపుడు నిర్మించిన డ్రైనేజీలు ఇరుకుగా ఉండడం, చాలా చోట్ల శిథిలావస్థకు చేరడంతో మురుగునీరు ముందుకు సాగడంలేదు. దానికి తోడు చెత్తాచెదారం నిండిపోయి మురుగు రోడ్లపైకి చేరుతోంది. మున్సిపల్‌గా మారడంతో పన్నులు పెంచారు కాని, నూతన డ్రైనేజీలు నిర్మించేందుకు చర్యలు తీసుకోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు విఫలం

డ్రైనేజీల నిర్వహణలో అధికారులు, పాలకవర్గం విఫలమైందనడానికి పలు ప్రాంతాల్లోని డ్రైనేజీలే నిదర్శనం. నూతనంగా నిర్మించే చర్యలు తీసుకుంటే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీలపై అక్రమ కట్టడాలు

అసలే పాత డ్రైనేజీలు.. దానికి తోడు నూతనంగా నిర్మాణాలు చేపట్టేవారు డ్రైనేజీలను కూల్చివేస్తున్నారు. కొన్ని చోట్ల వాటిని ఆక్రమించి భవనాలు కడుతున్నారు. దీంతో మురుగు నీరు నిలిచిపోయి ఇబ్బందికరంగా మారుతోంది. గత వర్షాకాలంలో 7వ వార్డు పరిధిలోని శుభోదయ, వికాస్ పాఠశాలల సమీపంలోని డ్రైనేజీ పొంగి ప్రవహించింది. ఇళ్ల మధ్యే నీరు నిలిచిపోయింది. అప్పుడు స్థానికులు చాలా ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా మున్సిపల్ ప్రత్యేక అధికారి స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

21, 22న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు



నినాదాలు చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 6వ మహాసభలను విజయవంతం చేయాలని డివిజన్ కార్యదర్శి ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజును నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 21, 22 తేదీల్లో సిద్దిపేటలో జరిగే జిల్లా 6వ మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అభికృష్ణ, వంశీ, అరుణ్‌కుమార్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

మూల మలుపు.. ప్రమాదాల పిలుపు

మూల మలుపుల వద్ద పిచ్చిమొక్కలు, పొదలు కమ్మేశాయి. దీంతో అవి ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. గజ్వేల్–తూప్రాన్ రహదారి వర్గల్ మండలం నాచారం వద్ద ఈ దుస్థితి నెలకొన్నది. అటువైపు నుంచి వచ్చే వాహనాలు కనపడక పోవడంతో నిత్యం ఏదో ప్రమాదం సంభవిస్తోంది. రోడ్డును పిచ్చిమొక్కలు ఆక్రమించి మలుపులో వస్తున్న వాహనాలు కనపడక వాహనచోదకులు భయాందోళను గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– వర్గల్(గజ్వేల్):



నాచారం వద్ద ఉన్న మూల మలుపు

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతర పోరాటం చేస్తోందని ఆ యూనియన్ నాయకులు అన్నారు. గజ్వేల్‌లో మండలశాఖ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, లింగంగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన ఎన్నో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత పీఆర్‌టీయూకే దక్కిందన్నారు. ఇదే స్ఫూర్తితో నిరంతరం పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, జైపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జానకీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాల అత్యుత్సాహం

మాలల కార్యాచరణ కమిటీ నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గజ్వేల్: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయని గజ్వేల్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాలల కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. నాయకులు నర్సింహులు, యాదగిరి, బైరం శివకుమార్ మాట్లాడుతూ 14న వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేస్తామన్నారు. మాలలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయండి

సదాశివపేట(సంగారెడ్డి): సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం పూర్తి వేతనం చెల్లించాలన్నారు. అదేవిధంగా జీవిత బీమా, లైఫ్ టైం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, గ్రామాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ప్రతి నెలా 1వ తూదీన విధిగా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వినోద, ముస్తఫా, పూలమ్మ, శంకరమ్మ, తస్లీమ్, రాజమ్మ, మునీరా, ఫర్జానా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇటీవల మండలంలోని గోవర్ధనగిరిలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు పడి మృతి చెందిన తల్లీకూతురుకు సంబంధించిన కుటుంబానికి ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి ఆదివారం రూ.5 ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం కోసం గౌరవెల్లి ఉపాధి హామీ కూలీలు ఆ మొత్తాన్ని పోగుచేసి శనివారం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మండల అధ్యక్షుడు పరంధాములు, ఉపాధి హామీ కూలీ శ్రీనివాస్, నాయకులు అంజయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నాయకుల ఇంటింటి ప్రచారం

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అశోక్ కుమార్‌ను గెలిపించాలని టీపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్, సిరి ఎన్‌క్లేవ్, ఎలైట్ కాలనీలో ఇంటింటి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగ జేఏసీలో అశోక్‌కుమార్ ప్రముఖపాత్ర పోషించారని, త్వరలో జరగనున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉద్యమ నేతను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు సత్యనారాయణ, రామచంద్రం, రాజులు, ఎల్లయ్య, శంకర్, నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, నర్సయ్య, సత్తయ్య, విద్యాసాగర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లయినా ఎలాంటి ఫలితం లేదు

– విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

హుస్నాబాద్: విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుచేసి చైర్మన్‌గా తమవారినే నియమించాలని ఆ సంఘం మండల నాయకులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు గడిచినప్పటికీ విశ్వబ్రాహ్మణులకు ఎలాంటి మేలు జరగలేదని, జనాభా నిష్పత్తి ప్రకారం తమకు రావాల్సిన నిధులు, నియామకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ముడి సరుకులు, కూలీల రేట్లు పెరిగాయని, 10 నుంచి 13వ తేదీ వరకు పనిరేట్ల పెంపుదల గురించి పనులు బంద్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఎగ్గోజు శ్రీనివాసచారి, పట్టణ అధ్యక్షుడు పోలోజు సదానందచారి, నాయకులు రాజమౌళి, లక్ష్మీనారాయణ, నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఓపెన్ తరగతులు



తరగతులు ప్రారంభిస్తున్న ఎంఈఓ, శ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో ఇంటర్ ఓపెన్ తరగతులు ఆదివారం ప్రారంభించారు. ఓపెన్ స్టడీ సెంటర్‌లో ఎంఈఓ, కోఆర్డినేటర్ నాగరం శ్రీనివాస్ తదితరులు తరగతులను ప్రారంభించారు. ఓపెన్ ఎస్‌ఎస్‌సీలో 50 మంది, ఇంటర్మీడియెట్‌లో 50 మంది అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మారుతి, సీఆర్‌పీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నాం

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నేత రాకేశ్‌కృష్ణన్



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా నెరుస్తున్నామని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బందిగా రాకేశ్ కృష్ణన్ అన్నారు. బీసీలకు చట్టసభల్లో 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ దూళ్మిట్టలో జనగామ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1931 తర్వాత దేశంలో బీసీ కులగణన జరగలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు 30యేళ్లుగా చేస్తున్న పోరాటానికి అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేశామని చెప్పారు. దేశంలో ఎక్కడా చేయని విధంగా ఏక కాలంలో బీసీ, ఎస్సీలకు న్యాయం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని చెప్పారు. అలాగే రాష్ట్రంలో 25లక్షల మందికి రుణమాఫీ చేశామని, భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా వారికి కూడా సహాయం అందిస్తున్నామని చెప్పారు. రూ.7లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయి ఉన్న రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై అసత్యపు ఆరోపణలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని హితబోధ చేశారు. కార్యక్రమంలో ఏవైసీ ప్రెసిడెంట్ సంతోష్, మద్దూరు, దూళ్మిట్ట, చేర్యాల మండలాల యూత్ అధ్యక్షుడు రమేశ్, సుమన్‌నాయక్, బాలరాజు, కనుకచంద్రం పుల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సిద్దిపేటరూరల్: 1998–99 విద్యాసంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు రాఘవాపూర్‌లోని పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించారు. చిన్ననాటి ఘటనలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లేశం కిషన్, లింగం, మహేశ్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్ల తర్వాత..

సిద్దిపేటజోన్: కలిసి చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా 25 యేళ్ల తర్వాత కలుసుకొని సందడి చేశారు. ఆదిత్య విద్యాలయ పూర్వ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



సిద్దిపేటజోన్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారం గ్రామంలో శ్రీశివ పంచాయతన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడతుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. రైతులకు రెండు లక్షలు రుణాలు మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని, ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కూడవెల్లి ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరో రాజ్యాంగం ఊహించలేం

- డాక్టర్ శ్రీనివాస్



సిద్దిపేటజోన్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో మరొక రాజ్యాంగాన్ని ఊహించలేమని ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక విపంచి ఆడిటోరియంలో ప్రజాస్వామిక రచయితల వేదిక ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకవేళ కొత్త రాజ్యాంగాన్ని అమలుచేస్తే అనాగరిక, మతమౌఢ్యం పెచ్చరిల్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషిని మనిషిగా గుర్తించడం, మహిళలకు ఆత్మగౌరవాన్ని అందించిన రాజ్యాంగం అంబేడ్కర్ ఆలోచనా విధానమే అన్నారు. అంతకుముందు కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడారు. కార్యక్రమంలో రంగాచారి, మహేశ్వరి, శంకర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): మృతుడి కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్ తెలిపారు. మండలంలోని దామరకుంటకు చెందిన బసన నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొని ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, నాయకులు బాల్‌నర్సయ్య, బాబు యాదవ్, యాదగిరి, లక్ష్మణ్, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష జపయజ్ఞం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న గిరిమహరాజ్, రాజు

సదాశివపేట(సంగారెడ్డి): శ్రీశైలంలో జరగనున్న శ్రీనరసింహ సరస్వతీ స్వాముల శోభాయాత్ర 'మహామృత్యుంజయ లక్ష జపయజ్ఞం' కరపత్రం ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు, 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరిమహరాజ్ ఆవిష్కరించారు. మమత, మనోజ్, శ్రీశైలం, వీరేశ్, అనిల్, ఆనంద్, రాము, అఖిల్, సోమశంకర్ పాల్గొన్నారు.